క్లుప్తంగా

అల్ఫోర్స్‌లో గ్రాడ్యుయేషన్ డే



విద్యార్థులతో చైర్మన్ నరేందర్ రెడ్డి

నిర్మల్‌టౌన్: జిల్లాకేంద్రంలోని ఆదర్శనగ అల్ఫోర్స్ ఈ–టెక్నో పాఠశాలలో శనివారం యూకేజీ విద్యార్థులకు గ్రాడ్యుయేషన్ డే నిర్వహించారు. దీనికి అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత నరేందర్‌రెడ్డి హాజరై విద్యార్థులకు పట్టాలు ప్రదానం చేశారు. నాణ్యమైన విద్య అందించి విద్యార్థులను జ్ఞానవంతులుగా తీర్చిదిద్దడమే అల్ఫోర్స్ ఉద్దేశమని పేర్కొన్నారు. విద్యార్థులు ప్రదర్శించిన నృత్యాలు అలరించాయి. ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

యాచకుడి మృతి

నిర్మల్‌టౌన్: జిల్లాకేంద్రంలోని మంచిర్యాల చౌరస్తా వద్ద ఓ యాచకుడు మృతి చెందిన ఘటన శనివారం చోటు చేసుకుంది. పట్టణ సీఐ ప్రవీణ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. చౌరస్తా వద్ద ఓ వ్యక్తి పడిపోయి ఉండటంతో స్థానికులు వెళ్లి చూడగా మృతి చెంది ఉన్నాడు. సమాచారం అందుకున్న పోలీసులు వచ్చి యాచకుడి మృతదేహాన్ని మున్సిపల్ సిబ్బందికి అప్పగించారు.

బీఎస్ఎన్ఎల్ సేవా శిబిరం

భైంసాటౌన్: పట్టణంలోని బీఎస్ఎన్ఎల్ కార్యాలయంలో శనివారం సేవా శిబిరం నిర్వహించారు. సంస్థ డీఈ శర్మన్ హాజరై ఈ సందర్భంగా వినియోగదారుల సమస్యలు, సలహాలు అడిగి తెలుసుకున్నారు. స్థానిక ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆలయంలో హోమం



ఊరేగింపుగా ఆలయానికి వస్తున్న భక్తులు

తానూరు: మండలంలోని తొండాల మహాదేవుడి ఆలయంలో శనివారం వేదపండితుల మంత్రోచ్ఛరణల నడుమ హోమం నిర్వహించారు. దంపతులు పూజలు చేశారు. సోమవారం ప్రతిష్ఠాపన సందర్భంగా విగ్రహాలను వీధుల గుండా ఊరేగింపుగా తీసుకొచ్చారు.

ప్లీనరీ విజయవంతం చేయాలి

నిర్మల్‌టౌన్: సికింద్రాబాద్‌లోని సీతాఫలమండీ జీహెచ్ఎంసీ ఈనెల 21న ఫంక్షన్‌హాల్‌లో నిర్వహించే తెలంగాణ ఉద్యమకారుల ప్లీనరీ సభను విజయవంతం చేయాలని ఆ ఫోరం రాష్ట్ర ఉపాధ్యక్షుడు పాకాల రాంచందర్, ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు కొట్టే శేఖర్ శని వారం ఓ ప్రకటనలో కోరారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలో భాగంగా ఉద్యమకారుల సంక్షేమ బోర్డు ఏర్పాటు చేసి ఉద్యమకారుడికి నివాస స్థలం, ఇల్లు నిర్మించి ఇవ్వాలని కోరారు. ఉమ్మడి జిల్లాలోని ఉద్యమకారులు హాజరై జయప్రదం చేయాలని కోరారు.

అభివృద్ధి పనులు ప్రారంభం

భైంసాటౌన్: పట్టణంలోని నాలుగు, ఐదో వార్డుల్లో రూ.40 లక్షలతో సీసీ డ్రెయినేజీ పనులు చేపడుతున్నట్లు మాజీ కౌన్సిలర్ చందూలాల్ తెలిపారు. శనివారం శివాజీనగర్‌లో సీసీ డ్రెయినేజీ పనులు ప్రారంభించారు. కాంగ్రెస్ నాయకులు నారాయణ్‌రావు పటేల్ చొరవతో సీసీ డ్రెయినేజీల నిర్మాణానికి ఎస్‌డీఎఫ్ నిధులు మంజూరు చేయించినట్లు పేర్కొన్నారు. ఆర్అండ్‌బీ జేఈ, స్థానికులు ఉన్నారు.

కడెం ఆయకట్టుకు నీరివ్వాలి

దస్తురాబాద్: కడెం ఆయకట్టు రైతులకు మరో నాలుగు రోజులు సాగునీటిని అందించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి నూతన్‌కుమార్ డిమాండ్ చేశారు. శనివారం దస్తురాబాద్‌లో మాట్లాడారు. చివరి దశలో ఉన్న వరి పొలాలకు నీటిని అందించి రైతాంగాన్ని ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు బొమ్మెన సురేశ్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు తిరుపతి, దుబ్బయ్య తదితరులు ఉన్నారు.

గాలికుంటు నివారణ టీకాలు



టీకా వేస్తున్న ఏడీ రామచంద్రుడు

ఖానాపూర్: పాడిరైతులు పశువులకు గాలి కుంటు వ్యాధి నివారణ టీకాలను విధిగా వేయించాలని ఖానాపూర్ వెటర్నరీ ఏడీ రామచంద్రుడు అన్నారు.శనివారం పట్టణంలోని పలు కాలనీల్లో పశువులకు టీకాలు వేశారు. మూడు నెలలు పైబడిన దూడలకు టీకాలు వేయించాలని సూచించారు. సిబ్బంది రవి, సుధీర్ తదితరులు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రం ప్రారంభం

పెంబి: మండలంలోని మందపల్లిలో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరిధాన్యం కొనుగోలు కేంద్రాన్ని శనివారం పీఏసీఎస్ చైర్మన్ శ్రీనివాస్ ప్రారంభించారు. కాంగ్రెస్ మండలాధ్యక్షుడు స్వప్నీల్‌రెడ్డి, అశోక్‌రావు, రమేశ్, శంకర్ తదితరులు ఉన్నారు.

‘ఆదర్శ’ లో సెల్ఫీ పాయింట్..!



సెల్ఫీ పాయింట్ వద్ద విద్యార్థుల సందడి

కుంటాల: మండలకేంద్రంలోని ఆదర్శ పాఠశాలలో శనివారం ఏర్పాటు చేసిన సెల్ఫీ పాయింట్ వద్ద విద్యార్థులు సందడి చేశారు. పాఠశాల పేరు, లోగోతో ఒక బ్యాక్ డ్రాప్, మధ్యలో నిలబడి ఫొటో దిగేందుకు వేదిక ఏర్పాటు చేశారు. సెల్ఫీ పాయింట్ ఏర్పాటుతో విద్యార్థులకు ఆహ్లాదకర అనుభూతి కలుగుతుందని ప్రిన్సిపాల్ నవీన్ కుమార్ తెలిపారు.

కంపు కొడుతున్న డ్రెయినేజీ

నర్సాపూర్(జి): మండలకేంద్రంలోని 61వ జాతీయ రహదారి పక్కన ప్రధాన డ్రెయినేజీ చెత్తతో నిండి కంపుకొడుతోంది. ఇష్టానుసారం ప్లాస్టిక్ వ్యర్థాలు పడేస్తుండటంతో డ్రెయినేజీ నిండి దోమలకు ఆవాసంగా మారింది. రాకపోకలు సాగించే ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. పంచాయతీ అధికారులు డ్రెయినేజీని శుభ్రం చేయించి ఇక్కడ చెత్తాచెదారం పడేయకుండా గ్రామస్తులకు అవగాహన కల్పించాలి.



సీట్లు పొందిన విద్యార్థులకు సన్మానం



లోకేశ్వరం: మండలంలోని రాజూర ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల నుంచి గురుకులంలో సీట్లు పొందిన 29 మంది విద్యార్థులను శనివారం సన్మానించారు. పాఠశాలలో 72 మంది నాలుగో తరగతి చదువుతుండగా 35 మంది గురుకులంలో ఐదో తరగతిలో ప్రవేశం పొందేందుకు ప్రవేశపరీక్ష రాశారు. అందులోంచి 29 మంది విద్యార్థులు ప్రతిభ కనబర్చి సీట్లు సాధించినట్లు ప్రధానోపాధ్యాయుడు జెడ్ల రాజేశ్వర్ తెలిపారు. సరస్వతి, ఉపాధ్యాయుడు నాగభూషణ్ తదితరులు ఉన్నారు.

భూభారతితో సమస్యల పరిష్కారం

- రాష్ట్ర మంత్రి సీతక్క
- ఖానాపూర్‌లో ఇందిరమ్మ మోడల్ హౌస్ ప్రారంభం



మోడల్ హౌస్ ప్రారంభిస్తున్న మంత్రి సీతక్క, పక్కన కలెక్టర్ అభిలాష అభినవ్, ఎమ్మెల్యే బొజ్జు

ఖానాపూర్: భూసమస్యలు పరిష్కరించి పేదప్రజలకు న్యాయం చేసేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం భూభారతి చట్టం తీసుకొచ్చిందని రాష్ట్ర పంచాయతీరాజ్, స్త్రీశిశుసంక్షేమశాఖ మంత్రి సీతక్క అన్నారు. రైతులు, పేదల భూములను లాక్కునేందుకు కేసీఆర్ ప్రభుత్వం ధరణి పోర్టల్ తీసుకొచ్చి దగా చేశారని పేర్కొన్నారు. శనివారం పట్టణంలోని ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో ఏర్పాటు చేసిన భూభారతి చట్టం అవగాహన సదస్సుకు హాజరై మాట్లాడారు. పేదప్రజలకు గూడును అందించేందుకే ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి శ్రీకారం చుట్టినట్లు పేర్కొన్నారు. ఖానాపూర్‌లో ప్రభుత్వ డిగ్రీ కళాశాల మంజూరుతోపాటు తహసీల్దార్ కార్యాలయ భవనానికి రూ.కోటి నిధులు విడుదల చేసేలా మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చారు. అంతకముందు ఇందిరమ్మ మోడల్ హౌజ్‌తో పాటు రూ. 12 కోట్లతో చేపట్టిన సీసీ రోడ్ల పనుల శిలాఫలకాలను ఎమ్మెల్యే బొజ్జు, కలెక్టర్ అభిలాష అభినవ్‌తో కలిసి ప్రారంభించి ఇంటిని పరిశీలించారు.

ఆక్రమణ భూములు కాపాడాలి...

కడెం మండలం బెల్లాల్ పరిసరాల్లోని గోదావరి కుర్రుపై ఉన్న వందలాది ఎకరాల గిరిజన భూములను ఈ ప్రాంతానికి చెందిన ఓ దొర గతంలో గిరిజనుల నుంచి లాక్కొని వాటిని జగిత్యాల జిల్లా రాయికల్ మండల భూములుగా రికార్డుల్లో మార్చారని ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్.. మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. సదరు భూములు తిరిగి గిరిజనులకు చెందేలా చూడాలని కోరారు. పట్టణంతోపాటు కడెం మండలంలోని మైసంపేట్‌లో కడెం నారాయణరెడ్డి భూములు కబ్జా చేశారని వీటిని దొర చెరలోంచి తప్పించే వరకు ప్రశ్నిస్తూనే ఉంటానని ఎమ్మెల్యే అన్నారు. మామడ మండలం పొన్కల్‌లో సదర్‌మాట్ ప్రాజెక్టు నుంచి ఖానాపూర్ వరకు ప్రత్యేక కాలువ ఏర్పాటు చేయాలని కోరారు. భూభారతి చట్టంతో రైతులు తహసీల్దార్ స్థాయిలోనే భూసమస్యలు పరిష్కరించుకోవచ్చని కలెక్టర్ అభిలాష అభినవ్ పేర్కొన్నారు. అనంతరం తమ ఇళ్లను అటవీశాఖ అధికారులు అన్యాయంగా కూల్చివేశారని రంగపేట గ్రామానికి చెందిన పలువురు మంత్రికి ఫిర్యాదు చేశారు. వారి సమస్యను పరిష్కరించి ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలని మంత్రి.. కలెక్టర్‌ను ఆదేశించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కిశోర్‌కుమార్, కేంద్ర మాజీ మంత్రి వేణుగోపాలచారి, ఏఎంసీ చైర్మన్ భూషణ్, వైస్ చైర్మన్ భూమన్న, మాజిద్, తదితరులున్నారు.

సర్కారుబడికి దాతల అండ



మాట్లాడుతున్న ఎక్సైజ్ సీఐ వెంకటేశ్

భైంసారూరల్: మండలంలోని చుచుంద్ గ్రామ జడ్పీ ఉన్నత పాఠశాల అభివృద్ధికి పలువురు దాతలు విరాళాలు అందించినట్లు హెచ్ఎం వెంకటేశ్ తెలిపారు. గ్రామానికే చెందిన దత్తురాం రూ.18వేల విలువైన సౌండ్ సిస్టం, నాగభూషణ్ పటేల్ రూ. 10వేల ప్లేట్లు, మండలంలోని వాలేగాంకు చెందిన పి.మహేశ్ రూ.30వేల విలువైన వాటర్ ప్యూరిఫైర్, భైంసా ఎక్సైజ్ సీఐ వెంకటేశ్ రూ.5వేలతో పోడియం ఏర్పాటు, బోరిగాం ప్రాథమిక పాఠశాల హెచ్ఎం ప్రజోత్‌కుమార్ రూ.40వేలను స్టేజీ ఏర్పాటు కోసం విరాళంగా అందించారు. శనివారం పాఠశాలలో దాతలకు పూలమాల వేసి శాలువాతో సత్కరించారు. దాతలు మాట్లాడుతూ విద్యార్థులు ఇష్టపడి చదివితే మంచి భవిష్యత్తు ఉంటుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు శ్రీనివాస్, ముత్తన్న, గజ్జారాం, గంగాధర్, రజితారాణి, గౌతమ్, గ్రామస్తులు భోజన్న, సిద్దిరాం, బాబురావు, శివ, గణేశ్, విద్యార్థులు తదితరులు ఉన్నారు.

గ్రామాల్లో అవగాహన సదస్సులు



నర్సాపూర్(జి) : మాట్లాడుతున్న తహసీల్దార్

కడెం: రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన భూభారతిచట్టంతో భూసమస్యలకు పరిష్కారం లభిస్తుందని తహసీల్దార్ ఆర్.ప్రభాకర్ అన్నారు. శనివారం మండలంలోని ఎలగడప, దిల్దార్‌నగర్, ఇస్లాంపూర్ గ్రామాల్లో భూభారతి చట్టంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా రైతులకు పలు అంశాలపై అవగాహన కల్పించారు. డీటీ లచ్చిరాం, ఆర్ఐలు శారద, లక్ష్మణ్, నాయకులు సలీం, భూమేశ్, రహీం, భూమరాజం తదితరులున్నారు.

నర్సాపూర్(జి): మండలంలోని నందన్, దర్యాపూర్ గ్రామాల్లో శనివారం భూభారతి చట్టంపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో తహసీల్దార్ సోమ శ్రీనివాస్, ఆర్ఐ సుమలత, సీనియర్ అసిస్టెంట్ పుష్పలత పాల్గొన్నారు.

సారంగపూర్: భూభారతి పోర్టల్‌తో భూముల సమస్యలకు పరిష్కారం లభిస్తుందని తహసీల్దార్ శ్రీదేవి అన్నారు. మండలంలోని నాగపూర్, అడెల్లి గ్రామాల్లో భూభారతిచట్టంపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఎంఆర్ఐ నర్సయ్య, సీనియర్ అసిస్టెంట్ అరవింద, స్వప్న, రాకేశ్, శ్రీకాంత్, రాజలింగు, అశోక్ తదితరులు ఉన్నారు.

కుంటాల: మండలంలోని సూర్యాపూర్ రైతువేదికలో భూభారతి ఆర్ఓఆర్ చట్టం–2025పై రైతులకు అవగాహన కల్పించారు. తహసీల్దార్ కమల్‌సింగ్, ఆర్ఐలు ఆడెల్లు, రాజేశ్వర్, పంచాయతీ కార్యదర్శి రాజబాపు, ఏఈవో చైతన్య, డైరెక్టర్లు నారాయణపటేల్, సాయినాథ్ పాల్గొన్నారు.

దస్తురాబాద్: మండలంలోని బుట్టాపూర్ గ్రామంలో శనివారం భూభారతి చట్టంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఖానాపూర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ భూషణ్ మాట్లాడుతూ ఈనెల 25వరకు రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ సర్వరాజ్ నవాజ్, డిప్యూటీ తహసీల్దార్ యాదవరావ్, ఆర్ఐ ఆర్తి, తదితరులు పాల్గొన్నారు.

ముధోల్: మండలంలోని తరోడా గ్రామంలో శనివారం భూభారతి పోర్టల్‌పై రైతులకు అవగాహన కల్పించారు. తహసీల్దార్ శ్రీకాంత్, తదితరులు ఉన్నారు.

లబ్ధిదారుల ఎంపికలో పేదలకు ప్రాధాన్యమివ్వాలి



మామడలో మాట్లాడుతున్న ఎంపీడీవో సుశీల్‌రెడ్డి

తానూరు: ఇందిరమ్మ ఇళ్లను అర్హులకే అందించేందుకు గ్రామాల్లో ఇందిరమ్మ కమిటీలు ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. శనివారం మండలకేంద్రంలోని రైతువేదికలో ఆయా గ్రామాల ఇందిరమ్మ కమిటీ సభ్యులతో సమావేశం ఎంపీడీవో నసీరొద్దీన్ సమావేశం నిర్వహించారు. లబ్ధిదారుల ఎంపిక పారదర్శకంగా జరిగేలా చూడాలని సూచించారు. గ్రామాల వారీగా వచ్చిన దరఖాస్తుల వివరాలను వెల్లడించారు. ఇందిరమ్మ కమిటీ సభ్యులు, అధికారులు తదితరులు ఉన్నారు.

భైంసారూరల్: ఇందిరమ్మ ఇళ్ల కోసం లబ్ధిదారుల ఎంపికలో నిరుపేదలకు మొదటి ప్రాధాన్యం ఇవ్వాలని ఎంపీడీవో సుధాకర్‌రెడ్డి సూచించారు. మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో ఆయా గ్రామాల ఇందిరమ్మ కమిటీల సభ్యులతో మాట్లాడారు. ఇళ్ల నిర్మాణం తీరు, నిబంధనలు, బిల్లుల చెల్లింపుల గురించి వివరించారు. సమావేశంలో ఎంపీవో ఎంఏ రహీం, ప్రత్యేకాధికారులు, కార్యదర్శులు, ఇందిరమ్మ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

లోకేశ్వరం: మండలకేంద్రంలోని రైతువేదికలో శనివారం ఇందిరమ్మ ఇళ్ల కమిటీ సభ్యులతో ఎంపీడీవో వెంకటరమేశ్ సమావేశం ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ ఇళ్ల నిర్మాణ పనులను ఇందిరమ్మ కమిటీ సభ్యులు పర్యవేక్షించాలని సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ మోతీరాం, ఏపీవో జగన్నాథ్ ఉన్నారు.

మామడ: మండల కేంద్రంలో ఇందిరమ్మ ఇళ్ల కమిటీ సభ్యులతో ఎంపీడీఓ సుశీల్‌రెడ్డి సమీక్ష నిర్వహించారు. మండలంలో వాస్తవపూర్ గ్రామాన్ని పైలట్ ప్రాజెక్టుగా ఎంపిక చేశామని పేర్కొన్నా రు.

నర్సాపూర్(జి): మండలకేంద్రంలోని రైతువేదికలో ఇందిరమ్మ కమిటీ సభ్యులు, పంచాయతీ కార్యదర్శులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఎంపీఓ తిరుపతిరెడ్డి మాట్లాడుతూ అర్హులనే ఇళ్ల కోసం ఎంపిక చేయాలని కమిటీ సభ్యులకు సూచించారు. ఎంపీడీవో పుష్పలత, డీటీ వాహీదొద్దీన్, వెటర్నరీ డాక్టర్ షేక్ ముక్తార్ తదితరులు పాల్గొన్నారు.

మొక్కజొన్న పంట, డ్రిప్ పైపులు దగ్ధం



దగ్ధమైన మొక్కజొన్న పంట

సారంగపూర్: మండలంలోని మహవీర్‌తండా పంచాయతీ పరిధిలోని దుర్గానగర్ తండాలో రాథోడ్ రామారావు అనే రైతుకు చెందిన మొక్కజొన్న పంట దగ్ధమైంది. చేనుపై ఉన్న విద్యుత్ తీగలు ఒకదానికొకటి తగిలి మంటలు చెలరేగడంతో ఎకరంలో మొక్కజొన్న కంకులు కాలి బూడిదయ్యాయి. మంటలు మిగతా చేన్లకు వ్యాపించకుండా రైతులు ఆర్పివేశారు. రూ.80వేల వరకు నష్టపోయానని ప్రభుత్వం ఆదుకోవాలని బాధితుడు వేడుకుంటున్నాడు.

కుంటాల: ప్రమాదవశాత్తు నిప్పంటుకుని డ్రిప్ పైపులు దగ్ధమైన ఘటన కుంటాలలో చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన కక్కెర ముత్యంరావు అనే రైతు శనివారం మధ్యాహ్నం జొన్న సాగుచేసిన వ్యర్థాలకు నిప్పుపెట్టాడు. ఇదే క్రమంలో పక్కనున్న డ్రిప్ పైపులకు మంటలు అంటుకున్నాయి. దగ్ధమైన పైపుల విలువ సుమారు రూ.1 లక్ష 50 వేల వరకు ఉంటుందని బాధితుడు వాపోయాడు.

‘పశ్చిమబెంగాల్‌లో దాడులు అరికట్టాలి’



దిష్టిబొమ్మను దహనం చేస్తున్న నాయకులు

నిర్మల్‌చైన్‌గేట్: పశ్చిమ బెంగాల్‌లో హిందువులపై దాడులకు నిరసనగా నిర్మల్ ఆర్డీవో కార్యాలయం ఎదుట వీహెచ్‌పీ, హిందూ సంఘాల నాయకులు శనివారం ఆందోళన చేశారు. ఈసందర్భంగా పశ్చిమబెంగాల్ సీఎం మమత బెనర్జీ దిష్టిబొమ్మ దహనం చేశారు. పశ్చిమ బెంగాల్‌లో రాష్ట్రపతి పాలన విధించాలన్నారు. బంగ్లాదేశ్, రోహింగ్యాలను బహిష్కరించాలన్నారు. కార్యక్రమంలో పతికే రాజేందర్, ఆనంద్, పార్థసారథి, ముప్పిడి రవి తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన సప్తాహం

తానూరు: మండలంలోని బెంబర గ్రామంలో హనుమాన్ ఆలయ ఆవరణలో వారం రోజులుగా కొనసాగుతున్న అఖండ హరినామ సప్తాహం శనివారం ముగిసింది. ఉదయం నిర్వహించిన కాళ్యకీర్తనలో నాందేడ్ జిల్లాకు యోగేశ్ మహరాజ్ పాల్గొని ప్రవచనాలు బోధించారు. ప్రతి ఒక్కరూ చెడు వ్యసనాలు వీడి భక్తిమార్గంలో నడవాలన్నారు. ఈసందర్భంగా పలువురు తులసీమాలలు స్వీకరించారు. ఉట్టి కొట్టి ప్రసాదం పంపిణీ చేశారు. అనంతరం కార్యక్రమంలో పాల్గొన్న మహరాజ్‌లను సన్మానించారు. గ్రామ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు చేశారు.

ఇంటిస్థలాల సమస్యలు పరిష్కరించాలి

ఖానాపూర్: పట్టణంలోని ఐదో వార్డు పరిధి ఇంద్రానగర్‌లో ఇంటిస్థలాల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ కాలనీవాసులు శనివారం కమిషనర్ జాదవ్ కృష్ణకు వినతిపత్రం అందజేశారు. మున్సిపల్ కార్యాలయంలో కాలనీవాసులు మాట్లాడారు. కాలనీలోని స్థలాలకు ఉన్న ఇంటి నెంబర్లను ఆన్‌లైన్ నుంచి తొలగించడంతో రిజిస్ట్రేషన్‌లు కావడం లేదని పేర్కొన్నారు. గతంలో పన్నులు చెల్లించి రసీదులు సైతం పొందామని వెంటనే తమ సమస్యకు పరిష్కారం చూపాలని విన్నవించారు. కార్యక్రమంలో రవి, సాయిరాం, ప్రశాంత్, రాము, ప్రవీన్, ప్రణయ్, రాజేశ్వర్, ప్రకాష్, ప్రతాప్, ప్రసాద్ తదితరులు ఉన్నారు.

విహారయాత్రలో కస్తూర్బా విద్యార్థినులు



ప్రాజెక్టు వద్ద విద్యార్థులు

దస్తురాబాద్: పీఎం శ్రీ ట్విన్నింగ్ కార్యక్రమంలో భాగంగా మండల కేంద్రానికి చెందిన కస్తూర్బా విద్యార్థినులు శనివారం విహారయాత్రకు తరలివెళ్లారు. నిజామాబాద్ జిల్లాలోని శ్రీరాంసాగర్ ప్రాజెక్టు, నిర్మల్‌లోని కొయ్య బొమ్మల కేంద్రాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ప్రాజెక్టు ఆయకట్టు, విద్యుత్ తయారీ, కొయ్యబొమ్మల ప్రత్యేకత తెలుసుకున్నారు. ఎస్ఓ తిరుమల, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

‘మే డే’ను జయప్రదం చేయాలి

నిర్మల్‌చైన్‌గేట్: 139 వ మేడేను జయప్రదం చేయాలని టీయూసీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రాజన్న అన్నారు. శనివారం జిల్లాకేంద్రంలోని భగత్‌సింగ్ భవన్‌లో టీయూసీఐ జిల్లా అధ్యక్షుడు కిషన్ అధ్యక్షతన జిల్లా కమిటీ సమావేశం నిర్వహించి మే డే పోస్టర్లు ఆవిష్కరించారు. కార్మిక వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా మే డే స్ఫూర్తితో కార్మిక వర్గం ఉద్యమించాలని పేర్కొన్నారు. ఈనెల 28న జిల్లా కేంద్రంలో పెన్షనర్ల భవన్‌లో నిర్వహించే కార్మిక సంఘాల జిల్లా సదస్సును జయప్రదం చేయాలని కోరారు. సమావేశంలో నాయకులు కిషన్, లక్ష్మణ్, ఆనంద్, గణేశ్, రమేశ్ పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

చెక్కు పంపిణీ

లోకేశ్వరం: మండలంలోని మన్మద్ గ్రామానికి చెందిన పెద్ద భోజారెడ్డికి రూ.60వేల విలువైన సీఎంఆర్ఎఫ్ చెక్కు మంజూరైంది. శనివారం దేగాంలోని తన నివాసంలో మాజీ ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి భోజారెడ్డికి చెక్కును అందజేశారు. శేఖర్‌రెడ్డి, సాయారెడ్డి, మహేందర్‌రెడ్డి, రాములు ఉన్నారు.

క్షీరాభిషేకం

మామడ: ఇందిరమ్మ ఇళ్లు, భూభారతి చట్టం తదితర సంక్షేమ పథకాలు అందిస్తున్నందుకు శనివారం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో సీఎం రేవంత్ రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. కాంగ్రెస్ మండల కన్వీనర్ శ్రీనివాస్‌రెడ్డి, రమణారెడ్డి, లింగారెడ్డి, జైసింగ్, లింగన్న, తి రుమల్, పడాల శ్రీనివాస్, నరేశ్‌రెడ్డి, బా ప య్య పాల్గొన్నారు.

ఎంపీడీవోకు ఫిర్యాదు

లక్ష్మణచాంద: మండలంలోని పీచర గ్రామంలో ఉపాధిహామీ పథకం పనుల్లో అవకతవకలు జరిగాయని ఎంపీడీవో రాధకు, కలెక్టరేట్‌లో ఫిర్యాదు చేసినట్లు గ్రామానికి చెందిన బొజ్జ అశోక్ కుమార్ పేర్కొన్నారు. గ్రామానికి చెందిన ఇద్దరు మహిళలు పనులకు వెళ్లకున్న హాజరైనట్లు మస్టర్‌లో ఆన్‌లైన్‌లో నమోదైందని ఆరోపించారు. ఫిర్యాదు అందిందని విచారణ జరిపి చర్యలు తీసుకుంటామని ఎంపీడీవో పేర్కొన్నారు.

నేడు ఆలయ వార్షికోత్సవం

మామడ: మండలంలోని కొరిటికల్ శ్రీదత్తశివసాయి ఆలయ వార్షికోత్సవం ఆదివారం నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. గణపతిపూజ, రుద్రహోమం, కుంకుమార్చన రాజశేఖర శర్మ ఆధ్వర్యంలో నిర్వహించనున్నారు.

సమష్టి సహకారంతో పార్టీ బలోపేతం

ఖానాపూర్: సమష్టి సహకారంతోనే పార్టీ బలోపేతమవుతుందని బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ అంకం మహేందర్ అన్నారు. శనివారం మండలంలోని మస్కాపూర్‌లో పార్టీ మండల అధ్యక్షుడు పుప్పాల ఉపేందర్ అధ్యక్షతన బీజేపీ బూత్, మండల కమిటీ సమావేశం నిర్వహించారు. రవీందర్‌రెడ్డి, రవీందర్, రమేశ్, రాజేందర్, రవి, గంగారెడ్డి ఉన్నారు.

క్లాత్ పంపిణీ

లక్ష్మణచాంద: స్థానిక ఎమ్మార్సీ కార్యాలయం వద్ద శనివారం పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు విద్యార్థుల ఏకరూప దుస్తుల క్లాత్‌ను పంపిణీ చేశారు. వేసవిలో మహిళా సంఘం సభ్యులతో కుట్టించి విద్యార్థులకు అందజేయనున్నారు. సీఆర్పీలు సుధాకర్, మహేందర్ తదితరులు ఉన్నారు.

పట్టుదల, క్రమశిక్షణ అలవర్చుకోవాలి



మాట్లాడుతున్న సీఐ నైలు

భైంసారూరల్: విద్యార్థులు పట్టుదల, క్రమశిక్షణ అలవర్చుకొని ఉన్నత చదువులు చదవాలని సీఐ నైలు సూచించారు. శనివారం మండలంలోని దేగాం ప్రభుత్వ ఉన్నత పాఠశాల వార్షికోత్సవం నిర్వహించగా సీఐ హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా విద్యార్థుల సాంస్కృతిక నృత్యాలు అలరించాయి. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ సూర్యకాంత్‌రెడ్డి, శ్రీనివాస్, బీజేపీ మండలాధ్యక్షురాలు సుష్మారెడ్డి, ఎంఈఓ సుభాశ్, హెచ్ఎం అజీమ్, తదితరులు ఉన్నారు.

నేడు ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన

నిర్మల్‌రూరల్: మండలంలోని అక్కాపూర్ వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం ధ్వజస్తంభ శిఖర మహోత్సవం నిర్వహించనున్నారు. మూడు రోజులుగా ఆలయంలో పూజలు నిర్వహిస్తున్నారు. గణపతి పూజ, అఖండ దీపస్థాపన తదితర కార్యక్రమాలను నిర్వహించారు.

ఇందిరమ్మ ఇళ్ల పనులు ప్రారంభం

భైంసారూరల్: మండలంలోని ఖథ్‌గాం గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను శనివారం డీఎల్‌పీఓ సుదర్శన్ ప్రారంభించారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రానికి వెళ్లి లబ్ధిదారుల హాజరు పరిశీలించారు. కార్యక్రమంలో ఎంపీవో రహీం, రాజు తదితరులు ఉన్నారు.